నిండు మనసుతో ఆశీర్వదించండి



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో గౌడ సంఘం సభ్యులు

- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- అన్నివర్గాల అభ్యున్నతికి కృషి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలు తనను నిండు మనసుతో ఆశీర్వదించి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్‌లో కురుమ, విశ్వకర్మ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అన్ని సామాజిక కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలు నిర్మించడంతో పాటు అనేక సంక్షేమ ఫలాలను అందించారని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, శ్రీశైలంయాదవ్, నాగరాజు, జ్యోతి, బాలాజీ, కోఆప్షన్ సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, కురుమ సంఘం అధ్యక్షుడు మల్లేష్, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల మద్దతు

పట్టణంలోని శ్రీనివాస్‌నగర్, మల్లికార్జుననగర్ కాలనీలతో పాటు శ్రీసాయినగర్‌లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తాము బీఆర్‌ఎస్ వైపే ఉంటామని కాలనీవాసులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ శాసనమండలి చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ పుష్ప, నాయకులు పాల్గొన్నారు.

ఎరుకల సంఘం నాయకుల సంపూర్ణ మద్దతు

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి ఏకగ్రీవాల మద్దతు పరంపర కొనసాగుతోంది. పటాన్‌చెరు పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎరుకల సంఘం ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ హాజరయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎరుకల సామాజికవర్గ సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు రాజకీయ పదవుల్లో సమన్యాయం పాటిస్తున్నారని తెలిపారు. మహిపాల్‌రెడ్డి విజయానికి ఏకగ్రీవంగా తమ మద్దతును ప్రకటిస్తున్నామన్నారు.

అభివృద్ధి పనులను వివరించండి

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సూచించారు. బొల్లారం మున్సిపల్ కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీఆర్‌ఎస్ భవనాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తన సతీమణి యాదమ్మతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మూడోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, హన్మంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డోలు కొడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

పటాన్‌చెరు: మైనార్టీల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీల ఆర్థికాభివృద్ధికి మొదటిసారిగా మైనార్టీ బంధు, లక్ష రూపాయల సాయం, రాష్ట్రవ్యాప్తంగా 200లకు పైగా మైనార్టీ గురుకులాలు ప్రారంభించి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని కొనియాడారు. కార్యక్రమంలో ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మెరాజ్‌ఖాన్, అబీద్ పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యం

సీఎం కేసీఆర్ నాయకత్వంలో కులం, మతం, ప్రాంతం తేడా లేకుండా అన్నివర్గాల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరులో పద్మశాలి సంఘం, గౌడ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి విజయానికి ఏకగ్రీవంగా సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి

పటాన్‌చెరు: అవినీతికి చిరునామాగా నిలిచిన కాంగ్రెస్ పార్టీని తరిమికొట్టి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్‌కు ప్రజలు పట్టం కట్టాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన సమావేశంలో జిన్నారం మండలం మంగంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు రూపేరావు శ్రీనివాస్, సత్యనారాయణ, రాములు, శివకుమార్, మురళిదాసు, కృష్ణ, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఇక్రిశాట్ కాలనీకి చెందిన ఎంఎం రెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణ, సీతారాంనాయక్, కిషోర్‌కుమార్, వరకుమార్, ప్రశాంత్‌రెడ్డి, రమేష్, నగేష్ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.



ఎరుకల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



మహిపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డిలను సన్మానిస్తున్న మైనార్టీ నేతలు

పతి కోసం సతి

జోరుగా ఎన్నికల ప్రచారం



శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి గాంధీ విజయం కోసం ఆయన సతీమణి శ్యామలాదేవి ప్రచారం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంటోంది. నగరంలో ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ఉన్న ప్రాంతం కావడంతో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి ప్రాధాన్యత పెరిగింది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు కోసం ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలే కాకుండా కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో పాల్గొంటున్నారు. ముఖ్యంగా అభ్యర్థుల భార్యలు కూడా రంగంలోకి దిగారు. ఇప్పటి వరకు అభ్యర్థులుగా ప్రకటించిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి వారి భార్యలు ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థి భార్య గాంధీ సతీమణి శ్యామలాదేవి ప్రచారం..

ప్రతి సారి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడిగాంధీ పోటీలో ఉండగా ఆయన భార్య శ్యామలాదేవి ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా 2014, 2018 ఎన్నికల్లో కూడా ఆమె ప్రచారం చేశారు. అదేవిధంగా ఈసారి కూడా ఇంటింటికి వెళుతూ బీఆర్‌ఎస్ పార్టీ కరపత్రాలను పంచుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్నారు. ఆమె ప్రచారంలో పాల్గొనడం సెంటిమెంటుగా అని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి.

ప్రతి ఎన్నికలో జగదీశ్వర్‌గౌడ్‌కు.. భార్య పూజిత ప్రచారం

కార్పొరేటర్‌గా మూడుసార్లు పోటీ చేసి విజయం సాధించిన జగదీశ్వర్‌గౌడ్‌కు ఆయన భార్య పూజితాగౌడ్ ప్రచారం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలలో గత రెండు టర్మ్‌లలో బీఆర్‌ఎస్ పార్టీలో జగదీశ్వర్‌గౌడ్‌కు మాదాపూర్, ఆయన భార్య పూజితాగౌడ్‌కు హఫీజ్‌పేట్ డివిజన్ టికెట్లను ఇవ్వగా ఇద్దరూ గెలుపొందారు. వారిలో జగదీశ్వర్‌గౌడ్‌కు ఫ్లోర్‌లీడర్ పదవిని కూడా అప్పగించారు. కానీ ఆయనకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఎన్నికలలో పోటీ చేస్తే టికెట్ ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆయన తన భార్యతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం, టికెట్ కేటాయించడంతో ఆయన, భార్య పూజితాగౌడ్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆమె కార్పొరేటర్ కావడంతో ఉన్న పరిచయాలతో ఆమె ప్రచారంలో దూసుకుపోతున్నారు.



కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్ విజయం కోసం ఆయన సతీమణి పూజితాగౌడ్ ఇంటింటి ప్రచారం



కాంగ్రెస్‌లో చేరికలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి మదీనాగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సుమారు 300 మంది కాంగ్రెస్‌లో చేరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్

- నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచన



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ శరత్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గం నామినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ (ఎన్నికల అధికారి) శరత్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని డీఎస్పీ పురుషోత్తంరెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజ, పటాన్‌చెరు డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ లాలూనాయక్, మాస్టర్ ట్రైనర్ అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తొలిరోజు.. ఒక నామినేషన్ !



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న శ్రీకాంత్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో శుక్రవారం తొలి నామినేషన్ దాఖలైంది. అమీన్‌పూర్ పరిధిలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్‌కు చెందిన జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, శ్రీ వరసిద్ధి వినాయక చారిటబుల్ అధినేత తోడేటి శ్రీకాంత్ గౌడ్(ప్రొఫెసర్) స్వతంత్ర అభ్యర్థిగా పటాన్‌చెరు నియోజకవర్గం నుండి నామినేషన్ వేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజాకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

ఆర్‌ఓ కార్యాలయం వద్ద ఐదంచెల భద్రత



సిబ్బందికి సూచనలు ఇస్తున్న మాదాపూర్ డీసీపీ సందీప్‌కుమార్

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఐదంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు మాదాపూర్ డీసీపీ సందీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం శేరిలింగంపల్లి ఆర్‌ఓ కార్యాలయం, 100 మీటర్ల పరిధిలో చేసిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు ఐదంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు ముందుగానే ఆర్‌ఓ అనుమతి తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారి సూచించే నిబంధనలను పక్కాగా అమలు చేస్తామని డీసీపీ వివరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీలకు అనుమతి తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆర్‌ఓ కార్యాలయానికి ఎవరిని అనుమతించవద్దని ఆయన అధికారులను ఆదేశించారు. పోలీసులకు కూడా ఆర్‌ఓ కార్యాలయం లోపలికి వెళ్లే అనుమతి లేదని తెలిపారు. ఆర్‌ఓ చాంబర్ ద్వారం వరకు మాత్రమే పోలీసులు వెళ్లే అవకాశం ఉందన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



పార్టీలో చేరిన ఆటో యూనియన్ సభ్యులతో ఎమ్మెల్యే గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎన్నో మంచి పనులు చేశాం.. నిండు మనసుతో మరోసారి ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ కోరారు .ఖాజాగూడలో గచ్చిబౌలి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోపన్‌పల్లి ఆటోయూనియన్ సభ్యులు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గణేష్ ముదిరాజ్, ప్రవీణ్, శ్రీను పటేల్, జంగయ్యయాదవ్, నరేష్, రాజుముదిరాజ్, జగదీష్, రమేష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, ప్రసాద్ ఉన్నారు.

సాయినగర్ కాలనీలో..

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సమక్షంలో వివిధ పార్టీల నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో సారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

ల్యాండ్‌మార్క్ అపార్ట్‌మెంట్‌లో ఆత్మీయ సమావేశం

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ల్యాండ్‌మార్క్ అపార్ట్‌మెంట్‌లో స్థానికులతో శుక్రవారం ఎమ్మెల్యే గాంధీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకుల్‌ప్లాట్స్‌లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. గోకుల్ ప్లాట్స్‌ను రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

చందానగర్ డివిజన్ పరిధిలోని కైలాసనగర్‌లో కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. అభివృద్ధి చూసి ఓటు వేయాలని ఆమె కోరారు. ఈ ప్రచారంలో స్థానిక వాసులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు రఘుపతిరెడ్డి, నాగరాజు, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, వరలక్ష్మి, మల్లిఖార్జున పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయం అందించాలి

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీకి హ్యాట్రిక్ విజయం అందించడానికి సమష్టిగా పని చేయాలని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ధరణి నగర్, జీఎస్‌ఆర్‌నగర్ కాలనీల్లో ప్రచారం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కైలాసనగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్

- ఒయాసిస్ స్కూల్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

రాయదుర్గం: విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమాన్ని రాయదుర్గంలోని ఒయాసిస్ స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడానికి అవినీతి వద్దు, దేశానికి కట్టుబడి ఉంటాం అనే నినాదాలతో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని అవగాహనా ర్యాలీ నిర్వహించారు. యూనిటీ రన్ కూడా నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉషా మాట్లాడుతూ దేశం సుస్థిరపాలనలో ఉండాలంటే అవినీతి లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ పునీత, కోఆర్డినేటర్ వసంత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గణేష్ గడ్డ హుండీ లెక్కింపు...

- 69 రోజుల ఆదాయం రూ.18 లక్షలు

పటాన్‌చెరుటౌన్: రుద్రారం గ్రామ పంచాయతీ పరిధిలోని గణేష్‌గడ్డ దేవస్థానంలో శుక్రవారం హుండీ లెక్కించారు. 69 రోజుల హుండీ ఆదాయం రూ.18 లక్షల 39 వేలు ఉన్నాయని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ,జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హుండీ ఆదాయాన్ని దేవాలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు సంతోషి జోషి, జగదీశ్వర్,చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ లెక్కింపులో అర్చకులు, గ్రామస్తులు

చికిత్స పొందుతూ బాలుడు మృతి



మియాపూర్ : హోటల్ మెట్లపై నుండి జారిపడిన బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం ... సిద్దిపేట జిల్లా చేర్యాల్ మండల్ ముస్త్యల్ గ్రామానికి చెందిన కమలాకర్, రేణుక దంపతుల కుమారుడు అఖిల్(14). కమలాకర్ గత ఎనిమిది సంవత్సరాల క్రిందట మరణించాడు. భార్య రేణుక మియాపూర్‌లోని టీఎస్‌నగర్ కాలనీలో కూతురు ,కుమారుడితో ఉంటూ స్థానికంగా కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. అఖిల్ మియాపూర్‌లోని సెయింట్ రీటా స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో మియాపూర్‌లోని సితారా గ్రాండ్ హోటల్‌లో ఓ ఫంక్షన్‌కు క్యాటరింగ్ బాయ్‌గా వెళ్లాడు. రాత్రి 12.30 గంటల సమయంలో పని ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో హోటల్ 8వ అంతస్తు మెట్లపై నుండి కాలు జారి గ్రౌండ్‌ఫ్లోర్‌లో పడిపోయాడు. దీంతో అఖిల్‌కు తీవ్ర గాయాలు కావడంతో మియాపూర్‌లోని శ్రీకర ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అఖిల్ శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

12 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 12 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. వారిని శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అమీన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థికి శుక్రవారం పీహెచ్‌డీ ప్రకటించారు. యూనివర్శిటీలోని ఇస్లామిక్ స్టడీస్‌లో సలేహ్ అమీన్ 'స్వతంత్ర భారతదేశంలో ఇస్లామిక్ న్యాయశాస్త్రం: ఒక విశ్లేషణాత్మక అధ్యయనం' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఇస్లామిక్ అధ్యయనాల విభాగం ప్రొఫెసర్ మహ్మద్ ఫాహిమ్ అక్తర్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్



గెజిట్ నోటిఫికేషన్‌ను నోటీసు బోర్డులో ఉంచుతున్న ఆర్‌ఓ బి.శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: తెలంగాణ ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ ప్రతులను శేరిలింగంపల్లి ఆర్‌ఓ కార్యాలయం నోటీసులు బోర్డులో ఉంచారు. శుక్రవారం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో వివరాలను శేరిలింగంపల్లి రిటర్నింగ్ అధికారి బి.శ్రీనివాస్ రెడ్డి నోటీస్ బోర్డులో పెట్టారు. నవంబర్ 3 నుంచి 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు వరకు నామినేషన్ ప్రక్రియ ఉంటుంది. 13న నామినేషన్ల పరిశీలన, 15న ఉప సంహరణ ఉంటుంది. 30న పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్‌లో తెలిపారు.

6 లీటర్ల మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ సృజనలక్ష్మీ నగర్ ఫేస్-2లోని కిరాణాషాప్‌లో మద్యం విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ మల్లయ్య సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు.6 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని, విక్రయిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు చేశారు

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక



హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీలోని విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను నిర్వహించామని ఏడీఈ శ్యామ్ రావు పేర్కొన్నారు. చందానగర్ సెక్షన్ పరిధిలోని మదీనాగూడ, రామకృష్ణనగర్, వైశాలీనగర్ తదితర ప్రాంతాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలు వినియోగదారులు తెలియజేశారని వెంటనే పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. ఏఈ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ రీ ఫిల్లింగ్ గోదాంపై దాడులు

23 సిలిండర్లు, మూడు పైపులు, మూడు వెయింగ్ మిషన్లు స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: గ్యాస్ రీ ఫిల్లింగ్ గోదాంపై టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించిన సంఘటన రుద్రారంలో చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సాయిలు కథనం ప్రకారం... రుద్రారం గ్రామంలో సైకిల్ టాకీస్ వెనకాల అక్రమ గ్యాస్ ఫిల్లింగ్ దందా నడుస్తుందని సమాచారం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడి నిర్వహించారు. రుద్రారం గ్రామానికి చెందిన సోదరులు లతీఫ్ ,రషీద్ నుండి 14 చిన్న గ్యాస్ సిలిండర్లు, 5 డొమెస్టిక్ ఖాళీ, నాలుగు డొమెస్టిక్ ఫుల్ సిలిండర్లు, మూడు వేయింగ్ మిషన్లు, మూడు ఫిల్లింగ్ పైపులను సీజ్ చేశారు. సామగ్రిని పటాన్‌చెరు పోలీసులకు అప్పగించారు.

ఆన్‌లైన్‌లో కారు కొనబోయి.. సైబర్ వలలో...

రూ.24,499 పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: ఫేస్‌బుక్‌లో కారు కొనేందుకు ప్రయత్నించిన వ్యక్తి సైబర్ వలలో పడి రూ.24,499 పోగొట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం...అమీన్‌పూర్ పరిధిలోని లింగమయ్య కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఈ ఏడాది మే 24వ తేదీన ఫేస్‌బుక్‌లో కారు అమ్ముతామని పెట్టిన పోస్టును చూసి అపరిచిత వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడి అతను చెప్పిన విధంగా పలు దఫాలుగా రూ.24,499 నగదు చెల్లించాడు. ఇంకా అడగడంతో అనుమానం వచ్చిన బాధితుడు,తను పెట్టిన నగదు తనకి తిరిగి ఇవ్వాలని అడగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు.దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి,అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుండి బయటకు వెళ్లిన మైనర్ బాలుడు అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన బాలుడు(17) గత నెల 31వ తేదీ బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు.దీంతో బాలుడు కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికిన ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం కుమారుడి అదృశ్యంపై తల్లి ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.